రైతు దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కుంచే శ్రీరామ కొండలరావును సామర్లకోట బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఘనంగా సన్మానించింది. కిసాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు మేనేజర్ మొగిలి వినోద్, ఫీల్డ్ ఆఫీసర్ హరితేజ, సిబ్బంది సాలువా కప్పి అభినందించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అనుసరిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న కొండలరావు సేవలను కొనియాడారు. రైతులు బ్యాంకింగ్ సేవలు, పంట రుణాలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని బ్యాంకు అధికారులు సూచించారు.

## ఎస్సీ హాస్టల్‌కు ఆర్వో ప్లాంట్



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం తరపున దుప్పట్లు, పడకలు, నైట్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. హాస్టల్‌కు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

# అయోధ్య కాండపై హస్తినలో యుద్ధం

- అస్త్ర, శస్త్రాలతో ప్రతిపక్షాలు సిద్ధం
- మోదీకి రాహుల్-ఖర్గే స్ట్రాంగ్ లెటర్
- విరాళాల దర్యాప్తుపై యుద్ధం మొదలు
- పార్లమెంట్‌కు ముందే పెరుగుతున్న హీట్



అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర, సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి సంయుక్తంగా లేఖ రాశారు. రామాలయానికి భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి విరాళాల నిర్వహణపై పూర్తి విచారణ జరగాలని కోరారు. ఈ లేఖ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందురోజు విడుదల కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

### భక్తుల నమ్మకానికి దెబ్బ

శ్రీరాముడిపై విశ్వాసంతో లక్షలాది మంది భక్తులు సమర్పించిన విరాళాలు దుర్వినియోగానికి గురయ్యాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కాంగ్రెస్ పేర్కొంది. భక్తుల కష్టార్జిత సొమ్ము భద్రంగా ఉండాల్సిన బాధ్యత ట్రస్ట్‌పై ఉందని గుర్తు చేసింది. ఈ వ్యవహారం సాధారణ నేరం కాదని, భక్తుల విశ్వాసంపై జరిగిన దెబ్బగా చూడాల్సిన అవసరం ఉందని లేఖలో పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ట్రస్ట్ ఏర్పాటు జరిగినప్పటికీ, సభ్యుల ఎంపిక పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిందని కాంగ్రెస్ పేర్కొంది. ట్రస్ట్‌లోని పలువురు సభ్యులకు ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌తో అనుబంధం ఉందని ఆరోపించింది. ఇలాంటి పరిస్థితుల్లో వెలుగు చూసిన భారీ ఆర్థిక అక్రమాలపై ప్రభుత్వం మౌనం పాటించడం సమంజసం కాదని విమర్శించింది. బాధ్యులెవరైనా చట్టం ముందు జవాబుదారీగా నిలవాలని డిమాండ్ చేసింది.

### లెక్కలు బహిర్గతం చేయాలి

ట్రస్ట్ ఆదాయం, ఖర్చుల పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విరాళాలు ఎలా వినియోగించారో ప్రతి భక్తుడికి తెలిసే హక్కు ఉందని స్పష్టం చేసింది. స్వతంత్ర విచారణ నివేదికను ప్రజల ముందుంచాలని కోరింది. దోషులపై వారి హోదా, ప్రభావం చూడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొంది. పారదర్శకతే ప్రభుత్వ విశ్వసనీయతను నిలబెడుతుందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. రామాలయ విరాళాల దొంగతనం వ్యవహారం జూన్ తొలి వారంలో వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు కీలక అధికారులు రాజీనామా చేశారు. జూన్ 25న ట్రస్ట్ ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ తాజా డిమాండ్‌తో వివాదం మరింత రాజకీయ వేడి రేపే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఈ అంశంపై చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గంభీరావుపేటలో బోనాల వేడుకలు



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు రంగురంగుల బోనాలను అలంకరించి, సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. డప్పుల చప్పుళ్లు, భక్తి గీతాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల క్షేమం, గ్రామాభివృద్ధి కోసం మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.

## మినర్వా విద్యార్థినులకు రాష్ట్ర అవార్డు



ప్రత్తిపాడు మండలంలోని మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'షైనింగ్ స్టార్' అవార్డులకు ఎంపికయ్యారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గొల్లవిల్లి దీప్తి 589 మార్కులు, ఆర్.వి.ఎస్. మహాలక్ష్మి 587 మార్కులు, గండికోట శివాంచిక 582 మార్కులు సాధించి ఈ ఘనత దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మురళీకృష్ణ, డీన్ ఆనంద్ జోష్ కుమార్, ప్రిన్సిపల్ శ్రీహరి, హెచ్‌ఎం నాగేశ్వరరావు విద్యార్థినులను అభినందించారు. వారి కృషి, పట్టుదల ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ విజయానికి సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## చేనేతకు ప్రభుత్వం అండ: సంఘాల హర్షం



చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై చేనేత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడాన్ని స్వాగతించాయి. ఆదివారం మండపేటలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును చేనేత సంఘాల నాయకులు కలిసి సత్కరించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం ప్రకటించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయాలు చేనేత కుటుంబాలకు కొత్త భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు.

ప్రభాత
కిరణమ్
సత్యానికి వారధి



సోమవారం 20 జులై 2026
www.prabhathakiranam.com

# బాపట్ల జిల్లాలో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్

- గంజాయి, అసాంఘిక కార్యకలాపాలే టార్గెట్..
- వాడరేవు, డీఎం పల్లిలో ఇళ్ళ తనిఖీలు

**బాపట్ల/చీరాల జులై 19 (నాదేశం)** : బాపట్ల జిల్లాలో నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఆదివారం చీరాల, బాపట్ల సబ్‌డివిజన్ల పరిధిలో ఈ ఆకస్మిక సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని మొత్తం 47 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

### వాడరేవు, డీఎం పల్లిలో సోదాలు..

చీరాల డీఎస్పీ ఎం.డి.మొయిన్ ఆధ్వర్యంలో చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాడరేవు వైఎస్సార్ కాలనీలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కాలనీలోని ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా సోదా చేసి, సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి నేతృత్వంలో బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఎం పల్లిలో నిర్వహించిన తనిఖీల్లో ప్రతి ఇల్లూ జల్లెడ పట్టి, ఆధారాలు లేని 30 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టడమే ప్రధాన ధ్యేయంగా ఈ సోదాలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి సరైన పత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయవద్దని, అవి దొంగిలించబడినవి లేదా నేరాలకు వాడినవి అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. పరిసరాల్లో గంజాయి విక్రయాలు జరిగినా లేదా అనుమానిత వ్యక్తులు కనిపించినా వెంటనే డయల్ 112 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 8333813228కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.




7లో..

# కీలకంగా మ్యాజిక్ ఫిగర్

- ఓటింగ్‌పై ఎన్డీఏ బేఫికర్ • పార్లమెంట్‌లో బిగ్ ఫైట్!
- నెంబర్స్ మైండ్ గేమ్ • పార్టీలకు వర్షాకాల హీట్
- కొత్త సమీకరణాల బీట్

అధికార పార్టీకి సంఖ్యా బలం ఉంది... కానీ పూర్తి భరోసా లేదు. ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉంది... కానీ ఐక్యత లేదు. ఒకవైపు బిల్లులు ఆమోదించాలన్న ప్రభుత్వ పట్టుదల... మరోవైపు వాటిని అడ్డుకోవాలన్న విపక్ష వ్యూహం. ఈ రెండింటి మధ్య అసలు పరీక్ష మాత్రం ప్రజల ఆశలదే. నేటి నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల వేదికగా మాత్రమే మిగిలిపోతాయా? లేక దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలకు వేదిక అవుతాయా? అన్న ప్రశ్న ఇప్పుడు దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. అధికార కూటమి సంఖ్యాబలం గతంతో పోలిస్తే పెరిగింది. అయినా రాజ్యాంగ సవరణ బిల్లులకు అవసరమైన మెజారిటీ ఇంకా సవాలుగానే ఉంది. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలు చాలానే ఉన్నాయి. కానీ ఆ అంశాలను ఒక్క గొంతుతో వినిపించే బలం మాత్రం బలహీనపడింది. చీలికలు, ఫిరాయింపులు, ఎన్నికల పరాజయాలు విపక్షాన్ని దెబ్బతీశాయి. ఇదే సమయంలో ధరలు, ఉపాధి, విద్య, రైతులు, ఆర్థిక వ్యవస్థ, పారదర్శక పాలన వంటి ప్రజల అసలు సమస్యలకు పార్లమెంట్ ఎంత సమయం కేటాయిస్తుందన్నదే కీలకం. రామాలయ విరాళాల వివాదం, నీట్ అక్రమాల ఆరోపణలు, విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు, ఆదాయపు పన్ను సవరణ వంటి అంశాలపై ప్రతిపక్షం గట్టిగా నిలబడనుంది. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలు, మహిళా రిజర్వేషన్ అమలు, రాజ్యాంగ సవరణకు అవసరమైన రెండు మూడవ వంతుల మెజారిటీ వంటి అంశాలు ఈ సమావేశాల ప్రధాన ఆకర్షణగా మారనున్నాయి. నెంబర్ గేమ్‌లో గెలిచేది ప్రభుత్వం కావొచ్చు... వ్యూహాల్లో పైచేయి సాధించేది ప్రతిపక్షం కావొచ్చు... కానీ చివరికి ప్రజల సమస్యలే సభలో గెలిస్తేనే ఈ సమావేశాలకు నిజమైన అర్థం ఉంటుంది. బిల్లుల భవితవ్యంతో పాటు సంఖ్యాబలం చుట్టూ తిరిగే రాజకీయ వ్యూహాలు ఈ వర్షాకాల సమావేశాలను అత్యంత ఉత్కంఠభరితంగా మార్చనున్నాయి.



# కావాలంటే మా రక్తం తీసుకో..

## కానీ రైతులకు నీళ్లు ఇవ్వు

5లో..

- రేవంత్‌కు హరీశ్ రావు అల్టిమేటం
- సాగునీటి కోసం మహా పాదయాత్ర

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రంగనాయకసాగర్‌కు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో రైతులు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతుల కష్టాలు చూడకుండా ప్రభుత్వం రాజకీయాలకే పరిమితమైందని ఆరోపించారు. ఈ ఉద్యమం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించినది కాదని, పూర్తిగా రైతుల స్వచ్ఛంద పోరాటమని స్పష్టం చేశారు.



# రేవంత్ వార్నింగ్

- గాంధీ భవన్‌కు వచ్చారో • ఆగస్టు 3 వరకు రావొద్దు
- సర్ కత్తి వేలాడుతోంది • ముందు ఆ పని చూడండి
- ముఖ్య నేతలకు సీఎం ఆదేశాలు

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై ముఖ్యమంత్రి, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఆగస్టు 3 వరకు గాంధీభవన్ చుట్టూ తిరగకుండా నేరుగా ప్రజల్లోకి వెళ్లాలని స్పష్టం చేశారు. ఓటర్లను చేరుకోవడం, దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయడమే ఇప్పుడు ప్రతి నాయకుడి ప్రధాన బాధ్యత అని ఆదేశించారు. గడువు పొడిగింపును పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు నాయకులు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని స్పష్టం చేశారు. (వివరాలు 5లో..)



# రాహుల్, ప్రియాంక చావు కోరుకుంటావా?

- ఇదేనా మీ సంస్కారం..
- ఇదేనా తెలంగాణ సంస్కృతి
- కేటీఆర్‌పై జగ్గారెడ్డి నిప్పులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. సరూర్‌నగర్ సభలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ సంస్కృతికి విరుద్ధమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ కుటుంబంపై అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తెలంగాణ ప్రజల సంస్కృతి కృతజ్ఞతను చాటేదేనని, వ్యక్తిగత ద్వేషాన్ని ప్రోత్సహించేదిగా కాదని పేర్కొన్నారు. (వివరాలు 5లో..)

# పేదోడి ఇంటికి గుడ్ న్యూస్

- నిరుపేద కలకు మరో అడుగు!
- పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం
- సొంతిళ్లే లక్ష్యమన్న పొంగులేటి

రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని, అర్హులైన చివరి లబ్ధిదారునికి ఇల్లు అందే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సంకల్పాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

5లో..





# నిరుద్యోగులను రెచ్చగొట్టొద్దు కేటీఆర్!

## కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్


తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత ఆవేశానికి లోనుకావద్దని శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. నిరసనల పేరుతో చట్టపరమైన కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచాలని కోరారు. న్యాయపరమైన అడ్డంకులను తొలగిస్తూ నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నామని వివరించారు. (వివరాలు 5లో..)

# అయోధ్య కాండపై హస్తినలో యుద్ధం


3లో..

- అస్త్ర, శస్త్రాలతో ప్రతిపక్షాలు సిద్ధం
- మోదీకి రాహుల్-ఖర్గే స్ట్రాంగ్ లెటర్
- విరాళాల దర్యాప్తుపై యుద్ధం మొదలు
- పార్లమెంట్‌కు ముందే పెరుగుతున్న హీట్

అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర, సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి సంయుక్తంగా లేఖ రాశారు. రామాలయానికి భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి విరాళాల నిర్వహణపై పూర్తి విచారణ జరగాలని కోరారు. ఈ లేఖ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందురోజు విడుదల కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.




# అఖిలపక్ష సమావేశంలో వాకౌట్!

## సర్కారు నిర్ణయాలపై విపక్షాల నాకౌట్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన వర్గానికి సమావేశంలో చోటు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసన చేపట్టాయి. కొద్దిసేపు సమావేశం నుంచి బయటకు వెళ్లిన ప్రతిపక్ష నేతలు తర్వాత తిరిగి హాజరయ్యారు. దీంతో సమావేశ ప్రారంభంలోనే రాజకీయ వేడి కనిపించింది.

5లో..



# పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపులు

- ట్రైనీ ఐపీఎస్‌పై మరో అధికారి కంప్లైంట్

దేశంలో అత్యున్నత పోలీసు అధికారులను తీర్చిదిద్దే హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో లైంగిక వేధింపుల ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై సహాధికారిణి చేసిన ఫిర్యాదు సంచలనంగా మారింది. అసభ్య సందేశాలు పంపడం, మానసిక వేధింపులు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం, శారీరక దాడి, బెదిరింపులు, లైంగిక దాడికి యత్నించాడనే ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు. అత్యున్నత క్రమశిక్షణకు ప్రతీకగా భావించే జాతీయ పోలీసు అకాడమీలో ఇలాంటి ఆరోపణలు వెలుగులోకి రావడం తీవ్ర చర్చకు దారితీసింది. ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశంపై ఆధారాలు సేకరిస్తూ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

# బహదూర్‌గూడ భూములపై ఉద్రిక్తత

## 36 మందిపై పోలీసు కేసులు నమోదు



శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ ప్రభుత్వ భూముల స్వాధీనం వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనలో మహిళలు, స్థానిక రైతులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సహా మొత్తం 36 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసులు నమోదైన వారిలో పటోళ్ల కార్తీక్‌రెడ్డి, పంతంగి భూపాల్‌రెడ్డి, మహేందర్, కోలన్ ప్రదీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు. బహదూర్‌గూడలో సర్వే నంబర్ 62లో 500 ఎకరాలు, సర్వే నంబర్ 28లో 150 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని స్థానిక రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. బుల్లెట్ రైలు, ఆర్టీసీ బస్సు ప్రాజెక్టుల కోసం ఈ 650 ఎకరాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు గత కొన్ని రోజులుగా నిరసన చేపట్టారు. (వివరాలు 5లో..)

# మా రక్తం కావాలంటే తీసుకో

- కానీ రైతులకు నీళ్లు ఇవ్వు
- రేవంత్‌కు హరీశ్ రావు అల్టిమేటం
- సాగునీటి కోసం మహా పాదయాత్ర



### 'మా రక్తం తీసుకో.. నీళ్లు ఇవ్వు'

రైతుల ప్రాణాల కంటే నీళ్లు ముఖ్యమని చెప్పిన హరీశ్ రావు, "మా రక్తం కావాలంటే తీసుకో.. కానీ రైతులకు నీళ్లు ఇవ్వు" అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును విమర్శించడం వల్ల పొలాలకు నీళ్లు రావని, పంపులను ఆన్ చేస్తేనే నీరు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కేసీఆర్‌ను తిడుతూ కాలం గడపడం కాకుండా రైతుల అవసరాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుత కరువు ప్రకృతి కారణంగా రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల వచ్చిందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు మంచి పేరు రాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పంపులు నడపడం లేదని విమర్శించారు. రైతుల గుండెల్లో ఆవేదన పెరుగుతోందని, పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### 70 టీఎంసీల నీరు వదిలేశారు

కాళేశ్వరం పంపులు ఆన్ చేసి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోసి ఉంటే రంగనాయకసాగర్ నిండుగా ఉండేదని హరీశ్ రావు అన్నారు. నీటిని ఎత్తకుండా దిగువకు వదిలేయడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం కలిగిందని ఆరోపించారు. రంగనాయకసాగర్‌లో ఇప్పుడు నీటి బదులు రాళ్లు, గుట్టలు, తాడిచెట్లు కనిపిస్తున్నాయని అన్నారు. ఒకప్పుడు నీటితో కళకళలాడిన రిజర్వాయర్ ఇప్పుడు వెలవెలబోతున్న దృశ్యం రైతులను కలిచివేస్తోందని చెప్పారు. ఈ సభ నుంచి ముఖ్యమంత్రికి ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నామని హరీశ్ రావు చెప్పారు. వెంటనే కాళేశ్వరం పంపులను ప్రారంభించి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లను నింపాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలను కాపాడటమే ప్రభుత్వ తొలి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు హరీశ్ రావు చేసిన రాజకీయ ఆరోపణలు మాత్రమే. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

చిన్నకోడూరు రైతుల పాదయాత్ర ఒక హెచ్చరిక మాత్రమేనని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్రంలోని అన్ని మండలాల రైతులు ఇలాంటి ఉద్యమాలు చేపడతారని హెచ్చరించారు.

# రేవంత్ వార్నింగ్

- గాంధీ భవన్‌కు వచ్చారో
- ఆగస్టు 3 వరకు రావొద్దు
- సర్ కత్తి వేలాడుతోంది
- ముందు ఆ పని చూడండి
- ముఖ్య నేతలకు సీఎం ఆదేశాలు



### నామినేటెడ్ పదవులకు నో

సర్ కార్యక్రమంలో చురుకుగా పనిచేయని వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు దక్కవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులు సహా కీలక బాధ్యతల విషయంలో పనితీరునే ప్రమాణంగా తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశాలకు హాజరుకాని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కూడా పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని స్పష్టం చేశారు. పది మంది ఇన్‌చార్జి మంత్రులు తమ జిల్లాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నేరుగా పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూలై 30న నియోజకవర్గాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించి పురోగతిని అంచనా వేస్తామని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా జిల్లాల్లో తరచూ సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

### రాహుల్‌తో భేటీ అవకాశం

బూత్ లెవల్ అధికారుల నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు అందించే సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అధికారుల నివేదికలనే నమ్మి పార్టీ ఫీడ్‌బ్యాక్‌ను నిర్లక్ష్యం చేసే ఇన్‌చార్జులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే పది రోజులు ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి బూత్ స్థాయి కార్యకర్తలను చురుకుగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వంద మంది బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. వారికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో కష్టపడే కార్యకర్తలను ప్రోత్సహించడమే ఈ నిర్ణయం ఉద్దేశమని చెప్పారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఇప్పుడు పార్టీకి అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపులు

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో (ఎస్‌వీపీఎన్‌పీఏ) ట్రైనీ ఐపీఎస్ అధికారిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు సంచలనం రేపింది. సహాధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిగా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు పేర్కొన్నారు. ఫిర్యాదులో లైంగిక వేధింపులు, శారీరక దాడి, బెదిరింపులు, డిజిటల్ వేధింపులకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.



### వాట్సాప్ సందేశాల నుంచి మొదలు

ఫిర్యాదు ప్రకారం జూన్ చివరి వారంలో వేధింపులు ప్రారంభమైనట్లు బాధిత అధికారి తెలిపారు. అసభ్యకరమైన వాట్సాప్ సందేశాలు పంపడంతో పాటు ఇతర ట్రైనీల ఎదుట తనపై అవమానకర వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. తన వ్యక్తిగత జీవితంపై తప్పుడు ప్రచారం చేస్తూ మానసికంగా వేధింపులకు గురి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సహచర ట్రైనీతో అక్రమ సంబంధం ఉందంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ ఒత్తిడి తెచ్చినట్లు కూడా తెలిపారు. జూలై 8న తన మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తీసుకుని పాస్‌వర్డ్ చెప్పించి వ్యక్తిగత సందేశాలను పరిశీలించాడని బాధితురాలు ఆరోపించారు. తన అనుమతి లేకుండా వ్యక్తిగత వీడియోను రికార్డు చేసి భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో తప్పుడు సమాచారం వ్యాప్తి చేశాడని కూడా ఆరోపించారు.

### దాడి చేశాడన్న ఫిర్యాదు

జూలై 9 రాత్రి తనను బలవంతంగా గదికి తీసుకెళ్లి జుట్టు పట్టుకుని దాడి చేశాడని బాధితురాలు ఆరోపించారు. గొంతు నులిమేందుకు ప్రయత్నించడంతో పాటు మెడపై కత్తి పెట్టి బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నాడని, అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించాడని ఆరోపించారు. మరుసటి రోజు కూడా మరోసారి తనపై దాడి చేశాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని మహిళలపై నేరాలు, దాడి, బెదిరింపులకు సంబంధించిన పలు సెక్షన్లతో పాటు సమాచార సాంకేతిక చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశంపై ఆధారాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారం దేశంలోని అత్యున్నత పోలీసు శిక్షణా సంస్థలో చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# బహదూర్‌గూడ భూములపై ఉద్రిక్తత




### 36 మందిపై పోలీసు కేసులు నమోదు

శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ ప్రభుత్వ భూముల స్వాధీనం వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనలో మహిళలు, స్థానిక రైతులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సహా మొత్తం 36 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసులు నమోదైన వారిలో పటోళ్ల కార్తీక్‌రెడ్డి, పంతంగి భూపాల్‌రెడ్డి, మహేందర్, కోలన్ ప్రదీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు. బహదూర్‌గూడలో సర్వే నంబర్ 62లో 500 ఎకరాలు, సర్వే నంబర్ 28లో 150 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని స్థానిక రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. బుల్లెట్ రైలు, ఆర్టీసీ బస్సు ప్రాజెక్టుల కోసం ఈ 650 ఎకరాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు గత కొన్ని రోజులుగా నిరసన చేపట్టారు.

**• పోలీసులపై దాడి ఆరోపణ**

భూముల వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని తొలగించేందుకు హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో శనివారం తెల్లవారుజామున అక్కడికి చేరుకున్నారు. రైతులు కంచె నిర్మాణాన్ని అడ్డుకునే అవకాశం ఉందనే సమాచారంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారులు దీక్షా శిబిరాన్ని తొలగించి భూముల చుట్టూ ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీక్ష చేస్తున్న రైతులు హైడ్రా చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు పోలీసులపై కారం చల్లడంతో పాటు కుర్చీలు విసిరినట్లు పోలీసులు తెలిపారు. పరిస్థితి అదుపు తప్పకుండా భారీగా బలగాలను మోహరించి నిరసనకారులను చెదరగొట్టారు. అనంతరం ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారనే అభియోగాలతో కేసులు నమోదు చేశారు.

**• పరిహారంపై విభేదాలు**

భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి 600 గజాల చొప్పున హెచ్ఎండీఏ లేఅవుట్ ప్లాట్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే రైతులు మాత్రం ఎకరానికి 800 గజాల ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయమైన పరిహారం లభించే వరకు పోరాటం కొనసాగుతుందని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఈ భూముల వివాదం రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ప్రతిపక్ష పార్టీలు రైతులకు మద్దతుగా నిలవగా, అధికార పక్షం మాత్రం ప్రభుత్వ అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తోంది. రైతుల ఆందోళన, భూముల స్వాధీనం, పరిహారం అంశాలపై రానున్న రోజుల్లో మరింత చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం భూముల స్వాధీనం ప్రక్రియ కొనసాగుతుండగా, నమోదైన కేసులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నిరుద్యోగులను రెచ్చగొట్టొద్దు కేటీఆర్!

## కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత ఆవేశానికి లోనుకావద్దని శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. నిరసనల పేరుతో చట్టపరమైన కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచాలని కోరారు. న్యాయపరమైన అడ్డంకులను తొలగిస్తూ నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నామని వివరించారు.

**• గ్రూప్-1పై బీఆర్ఎస్‌ను ప్రశ్నించిన మంత్రి**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రూప్ 1 నియామక ప్రక్రియను కూడా పూర్తి చేయలేదని శ్రీధర్ బాబు ఆరోపించారు. తెలంగాణ ఏర్పడక ముందు 2011లో చివరిసారిగా గ్రూప్ 1 పరీక్ష జరిగిందని గుర్తు చేశారు. 2011 నుంచి 2024 వరకు గ్రూప్ 1 నియామకాలు ఎందుకు జరగలేదో బీఆర్ఎస్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడినందుకు బీఆర్ఎస్ నాయకత్వం క్షమాపణ చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 600 గ్రూప్ 1 పోస్టుల భర్తీ పూర్తయిందని మంత్రి తెలిపారు. దశాబ్ద కాలంగా ఎదురు చూసిన అభ్యర్థులు ఇప్పుడు తాండూరు, వికారాబాద్, పరిగి, జగిత్యాల వంటి ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు.




### జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత

బీఆర్ఎస్ పాలనలో ఎంతమందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారో వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్‌కు శ్రీధర్ బాబు సవాల్ విసిరారు. ఉద్యోగాల విషయంలో బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ లైబ్రరీ అంశంపై కూడా బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. జాబ్ క్యాలెండర్ అమలుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. రిజర్వేషన్లకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై నిపుణులతో సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో కోర్టు వివాదాలు తలెత్తకుండా అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో వెనక్కి తగ్గదని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# పేదోడి ఇంటికి గుడ్ న్యూస్

- నిరుపేద కలకు మరో అడుగు!
- పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం
- సొంతిళ్లే లక్ష్యమన్న పొంగులేటి

### సోమవారం ఎల్ఐజీ ఇళ్ల ప్రారంభం


క్యూర్, పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని సోమవారం సచివాలయంలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమానికి ముందు ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. హైదరాబాద్, రంగారెడ్డి ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అలీతో కలిసి దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

### గ్రామాల తర్వాత నగరాలపై దృష్టి

ఇప్పటివరకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ నిర్మాణంపై ప్రధానంగా దృష్టి పెట్టిందని మంత్రి చెప్పారు. గ్రామాల్లో ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సబ్సిడీతో ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అందులో దాదాపు రెండు లక్షల ఇళ్లు పూర్తై వేలాది కుటుంబాలు గృహప్రవేశం చేశాయని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు.

### లక్ష ఎల్ఐజీ ఇళ్ల లక్ష్యం

హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల కోసం లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. తొలి విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. నగరానికి దూరంగా కాకుండా ప్రజలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని స్పష్టం చేశారు. కుటుంబాల జీవనోపాధి, పిల్లల చదువులు, ఉద్యోగాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించామని తెలిపారు.




### బహుళ అంతస్తుల గృహాలు

పేదల కోసం నగరంలోని విలువైన ప్రాంతాల్లో స్థలాలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి వివరించారు. అవసరాన్ని బట్టి ఒక ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు భూమిని సేకరించినట్లు తెలిపారు. పది అంతస్తుల వరకు ఆధునిక బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి అన్ని మౌలిక సదుపాయాలతో గౌరవప్రదమైన జీవనం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని అదే నియోజకవర్గ ప్రజలు అక్కడే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### 8 లక్షల ఇళ్ల దిశగా ప్రభుత్వం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని మంత్రి తెలిపారు. గత ఏడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. గ్రామం నుంచి మహానగరం వరకు ప్రతి అర్హత కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించే వరకు ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం ఆగదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# రాహుల్, ప్రియాంక చావు కోరుకుంటావా?

- ఇదేనా మీ సంస్కారం..
- ఇదేనా తెలంగాణ సంస్కృతి
- కేటీఆర్‌పై జగ్గారెడ్డి నిప్పులు




### సోనియా పాత్రను గుర్తు చేసిన జగ్గారెడ్డి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారని జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ బిడ్డలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చావును కోరుకుంటావా కేటీఆర్? ఇదేనా తెలంగాణ సంస్కృతి అంటూ ఆయన మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు స్వయంగా వెళ్లి సోనియా గాంధీని కలిసి కృతజ్ఞతలు తెలిపిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు.

### ఉద్యోగాలపై ప్రశ్నలు

నిరుద్యోగుల పేరుతో రాజకీయాలు చేస్తున్న కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని జగ్గారెడ్డి ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 562 గ్రూప్ 1 ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు. వివిధ శాఖల్లో కలిపి సుమారు 70 వేల ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని ఎందుకు ప్రస్తావించడం లేదని నిలదీశారు. ఈ అంశంపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

### బీఆర్ఎస్ పాలనపై విమర్శలు

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రూప్ 1 పరీక్ష పేపర్ లీక్ కావడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని జగ్గారెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో అశోక్‌నగర్‌కు వెళ్లి నిరుద్యోగులకు సమాధానం చెప్పారా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఉద్యోగాల విషయంలో బీఆర్ఎస్ యువతను నిరాశపరిచిందని విమర్శించారు. ఇప్పుడు అదే అంశంపై రాజకీయాలు చేయడం విడ్డూరమని అన్నారు.

### విలువల రాజకీయాలపై వ్యాఖ్యలు

గాంధీ కుటుంబం మాట ఇస్తే నిలబెట్టుకునే రాజకీయాలు చేస్తుందని జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబం మాత్రం మాట ఇచ్చి మోసం చేసే రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. విలువలతో కూడిన రాజకీయాలకు కాంగ్రెస్ ప్రతీక అయితే, విలువలు లేని రాజకీయాలకు బీఆర్ఎస్ నిలువెత్తు ఉదాహరణ అని విమర్శించారు. తెలంగాణ ప్రజలు ఈ తేడాను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు.

### రాజకీయ వేడి పెరిగింది

కేటీఆర్ వ్యాఖ్యలు, వాటిపై జగ్గారెడ్డి చేసిన తాజా విమర్శలతో తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత ముదిరింది. ఉద్యోగాలు, తెలంగాణ ఏర్పాటు, గాంధీ కుటుంబం పాత్ర వంటి అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర విమర్శలు కొనసాగుతున్నాయి. జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ ఆరోపణలు, అభిప్రాయాలే. వీటిపై బీఆర్ఎస్ నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.



# పర్ఫార్మన్స్ లేని వారు డౌట్

# సగం మంది సిట్టింగ్‌లు ఔట్

## సర్వే ఫలితాలతో ఎమ్మెల్యేలు షాక్

- బాబుగారి నిర్ణయంతో తమ్ముళ్లు షేక్
- సర్వేల సరాగం..! సగం మందికే టికెట్ల స్వరం..?
- 2029 కోసం చంద్రబాబు మాస్టర్ ప్లాన్...
- 1999 ఫార్ములాతో భయం భయంగా సిట్టింగ్స్
- ఎంపీల సమావేశంలో గుట్టు విప్పిన పసుపు దళపతి

**భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా భవిష్యత్ రాజకీయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి కేంద్రీకరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుపై బహుళస్థాయి సమీక్షలు, క్షేత్రస్థాయి సర్వేలు, ఇంటెలిజెన్స్ నివేదికలు, డిజిటల్ విశ్లేషణలు, రాజకీయ ఫీడ్ బ్యాక్ ఆధారంగా నాయకుల పనితీరును అంచనా వేస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. ఇటీవల ఎంపీల సమావేశంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపగా, 1999 ఎన్నికల వ్యూహాన్ని ప్రస్తావించడం మరింత ఆసక్తి రేకెత్తించింది. పనితీరు లేని వారికి భవిష్యత్‌లో అవకాశాలు కష్టమనే సంకేతాలు వెళ్లాయని, కొందరు సిట్టింగ్ ప్రజాప్రతినిధుల్లో ఆందోళన పెరిగిందనే చర్చ వినిపిస్తోంది. అధికార వ్యతిరేకత పెరగక ముందే లోపాలను గుర్తించి సరిదిద్దాలన్న వ్యూహంతో పార్టీ ముందుకు సాగుతోందని సమాచారం. అయితే "సగం మందికి టికెట్లు కట్", "1999 ఫార్ములా మళ్లీ అమలు" వంటి ప్రచారాలపై అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, సర్వేలు ఆధారంగా పనితీరుకు ప్రాధాన్యం పెరుగుతుందనే సంకేతాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో అధికార పార్టీలో ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ ఇప్పుడు ప్రజల్లో తన పనితీరే రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే రిపోర్ట్ కార్డుగా మారుతుందా అన్న ఉత్కంఠ నెలకొంది.**

సర్వేల షాక్... తమ్ముళ్లకు టికెట్ టెన్షన్
బంపర్ మెజారిటీ సాధించినా.. చంద్రబాబు సీఎం సీట్లో కుదురుగా కూర్చోవడం లేదు. అలాగని అందివచ్చిన అవకాశాన్ని యువ మంత్రి నారా లోకేష్ అనుభవిస్తున్నారా... అంటే అదీ సాధ్యం కావడం లేదు. మరి ఈ ఇద్దరు తండ్రీ కొడుకులు ఏం చేస్తున్నట్టు... 2029 ఎన్నికల్లో మళ్లీ గెలుపే లక్ష్యంగా వేట మొదలెట్టారా.. ఆ సమరం కోసం ఇప్పటి నుంచే సర్వం సిద్ధం చేసుకుంటున్నారా.. అంటే.. అవుననే సంకేతాలు వినవస్తున్నాయి. అదుపు తప్పిన రాష్ట్రాన్ని గాడిన పెట్టడం మొదలు.. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రజా నిధుల లెక్కాపక్కా ఎప్పటికప్పుడు తేల్చి పడేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 2029 ఎన్నికల వేడి ఇప్పటి నుంచే పొగలు కక్కుతోంది. అత్యంత చర్చనీయాంశంగా కూడా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే పాలనపై దృష్టి పెట్టిన తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు మరోవైపు పార్టీ బలోపేతం పైనా సమాన శ్రద్ధ చూపుతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అధికారాన్ని సాధించడం ఒక దశ అయితే... దానిని నిలబెట్టుకోవడం మరో పెద్ద సవాలు. ఆ సవాలును ఎదుర్కొనేందుకు చంద్రబాబు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారనే సంకేతాలు వరుసగా బయటకు వస్తున్నాయి. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై నిరంతర నిఘా, క్షేత్రస్థాయి సర్వేలు, ఇంటెలిజెన్స్ నివేదికలు, ఐటీడీపీ విశ్లేషణలు, రాజకీయ వ్యూహకర్తల ఫీడ్‌బ్యాక్... ఇవన్నీ కలిపి భవిష్యత్ టికెట్లకు ప్రామాణికంగా మారనున్నాయనే చర్చ టీడీపీలో జోరుగా సాగుతోంది. రెండు రోజుల క్రితం ఎంపీలతో సమావేశమైన చంద్రబాబు అదే భేటీలో చేసిన వ్యాఖ్యలు పార్టీ అంతర్గత రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. ఎంపీలు ఎమ్మెల్యేలు దారి తప్పితే టీడీపీకి నష్టం తప్పదు... అవసరమైతే 1999 సీన్ రిపీట్ చేస్తానంటూ ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో సంచలనం రేపుతున్నాయి. ఈ ఒక్క వ్యాఖ్యలు చాలామంది ప్రజాప్రతినిధుల్లో ఆందోళన రేపిందని కూడా విస్తృత ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే 1999 ఎన్నికల సమయంలో పార్టీకి భారంగా మారిన నేతలను పక్కన పెట్టి కొత్త ముఖాలకు అవకాశం ఇచ్చిన వ్యూహమే విజయానికి కారణమైందని చంద్రబాబు ఇదివరకే పలుమార్లు ప్రస్తావిస్తూ వస్తున్నారు.

**• సర్వేల వడపోత... ఎమ్మెల్యేల రాజకీయ భవిత**

ఈసారి కూడా అదే తరహా వ్యూహం అమలు కావచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే పనితీరు అంచనాలు ప్రారంభించడం వెనుక ఒక స్పష్టమైన రాజకీయ లెక్క ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజల్లో వ్యతిరేకత పెరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే సమస్యలను గుర్తించి సరిదిద్దడం మంచిదనే విధానాన్ని చంద్రబాబు అనుసరిస్తున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. టీడీపీ వర్గాల సమాచారం ప్రకారం ప్రస్తుతం ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీ పనితీరుపై బహుళస్థాయి పర్యవేక్షణ కొనసాగుతోంది. ఒకే ఒక్క సర్వేపై ఆధారపడకుండా వివిధ వనరుల నుంచి సమాచారం సేకరించే వ్యవస్థ అమలులో ఉందని చెబుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజాభిప్రాయం, పార్టీ కార్యకర్తల స్పందన, స్థానిక నాయకులతో సమన్వయం, అధికారులతో వ్యవహరించే తీరు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ... ప్రతి అంశం ప్రత్యేకంగా పరిశీలనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియలో ఇంటెలిజెన్స్ విభాగం నివేదికలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయనే చర్చ జరుగుతోంది. ప్రజల్లో ఎమ్మెల్యే.. ఎంపీపై ఉన్న అభిప్రాయం, స్థానిక అసంతృప్తి, వర్గపోరు, రాజకీయ ప్రభావం వంటి అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం ద్వారా వచ్చే సమాచారాన్ని కూడా రాజకీయంగా విశ్లేషిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో పార్టీకి చెందిన అంతర్గత సర్వేలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయని సమాచారం.

**• రాబిన్ రిపోర్ట్... లోకేశ్ ఫీడ్‌బ్యాక్**

రాజకీయ వ్యూహకర్త రాబిన్ శర్మ బృందం సైతం వివిధ నియోజకవర్గాలపై విశ్లేషణలు అందిస్తున్నట్లు ప్రచారం ఉంది. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా పాలనా కాలమంతా ప్రజల అభిప్రాయాలను అధ్యయనం చేసి పార్టీ అధిష్టానానికి నివేదికలు అందించే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తోందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి తోడు ఐటీడీపీ బృందాలు సోషల్ మీడియా స్పందన, డిజిటల్ ఇమేజ్, ప్రజా చర్చలు, స్థానిక రాజకీయ ధోరణులను విశ్లేషిస్తూ ప్రత్యేక నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా నారా లోకేష్‌కు చెందిన రాజకీయ సమన్వయ బృందం కూడా క్షేత్రస్థాయి సమాచారం సేకరిస్తోందని చెబుతున్నారు. యువ నాయకులతో సంబంధాలు, పార్టీ కార్యక్రమాల్లో చురుకుదనం, కార్యకర్తలతో అనుబంధం, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనే తీరు వంటి అంశాలను ప్రత్యేకంగా అంచనా వేస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అన్ని నివేదికలు చివరకు అధిష్టానం ముందుకు చేరి ప్రతి నియోజకవర్గంపై సమగ్ర విశ్లేషణగా మారుతున్నాయని అంటున్నారు. టీడీపీలో ప్రస్తుతం ఎక్కువగా వినిపిస్తున్న పదం "పనితీరు". గతంలో సీనియారిటీ, రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రధాన ప్రమాణాలుగా ఉండేవి. ఇప్పుడు వాటితో పాటు ప్రజాదరణ, అందుబాటు, ఫలితాలు, కార్యకర్తల విశ్వాసం కూడా సమాన ప్రాధాన్యం పొందుతున్నాయని తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యే ఎంపీ ప్రజల్లో బలమైన ఇమేజ్‌ను నిలబెట్టుకోలేకపోతే భవిష్యత్తులో టికెట్‌పై ప్రభావం పడే అవకాశం ఉందనే సంకేతాలు పార్టీ నాయకత్వం ఇస్తోందని భావిస్తున్నారు.

### నేతల భవితవ్యం తేల్చనున్న రిపోర్ట్ కార్డు

మొత్తం చర్చలో ఒక విషయం అయితే కచ్చితంగా గుర్తుంచుకోక తప్పదు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న "సగం మందికి టికెట్లు కట్", "1999 వ్యూహం యథాతథంగా అమలు", "ఫలానా నేతలకు టికెట్ ఖాయం కాదు" వంటి అంశాలపై చర్చోపచర్చలు జోరుగా సాగుతున్నా అవి అధికారికమైన నిర్ణయాలు కాకపోవచ్చు. ఇవి పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చలు మాత్రమే. తుది అభ్యర్థుల ఎంపిక ఎన్నికల సమయానికి రాజకీయ పరిస్థితులు, ప్రజాభిప్రాయం, మిత్రపక్షాల సమీకరణలు, స్థానిక పరిస్థితులు వంటి అనేక అంశాలు మారిపోయే అవకాశాలు ఉండొచ్చు. సర్దుబాట్లు నేతల తీరుతెన్నులు సైతం మార్చుకునే వెసులుబాటు కూడా ఉండొచ్చు. ఆధారపడి ఉండే అవకాశం ఉంది. అయినప్పటికీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ ఇప్పటి నుంచే సంస్థాగతంగా, రాజకీయంగా, సాంకేతికంగా భారీ స్థాయిలో సిద్ధమవుతోంది. సర్వేలు, ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్లు, రాజకీయ విశ్లేషణలు, డిజిటల్ డేటా, క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్... ఇవన్నీ కలిపి ప్రతి ప్రజాప్రతినిధికి ఒక రాజకీయ రిపోర్ట్ కార్డుగా మారే దిశగా పరిస్థితులు కదులుతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది. రాబోయే రోజుల్లో ఈ రిపోర్ట్ కార్డులే టికెట్ భవితవ్యాన్ని నిర్ణయిస్తాయా? లేక రాజకీయ సమీకరణాలే చివరి మాట చెబుతాయా? అన్నది మాత్రం కాలమే తేల్చాల్సి ఉంది.




**• ఫస్ట్ వార్నింగ్.. నెక్స్ట్ ఎలిమినేషన్**

ఇటీవల జరిగిన సమావేశాల్లో కొందరు ప్రజాప్రతినిధులపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పలుమార్లు సూచనలు చేసినప్పటికీ పనితీరులో మార్పు కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కార్యకర్తలతో దూరం పెరగడం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం, వ్యక్తిగత వ్యవహారాలతో పార్టీకి ఇబ్బందులు కలిగించడం వంటి అంశాలపై ఆయన తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టంగా సూచించినట్లు సమాచారం. ఒకే జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు ఉంటే వాటి ప్రభావం నేరుగా పార్టీపై పడుతుందని ఆయన అభిప్రాయపడినట్లు చెబుతున్నారు. వ్యక్తిగత ఆధిపత్య పోరాటాలకు బదులుగా జట్టు భావనతో పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న నాయకులను వెంటనే మార్చేయాలనే నిర్ణయం కంటే ముందు వారికి ఫీడ్‌బ్యాక్ ఇచ్చి సరిదిద్దే అవకాశాన్ని కల్పించాలనే విధానాన్ని కూడా చంద్రబాబు అనుసరిస్తున్నారని సమాచారం. సర్వేల్లో వచ్చిన ప్రతికూల అంశాలను నేరుగా సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేసి వాటిపై మార్పు తీసుకురావాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ మార్పు కనిపించని పరిస్థితుల్లో మాత్రం కఠిన నిర్ణయాలకు వెనుకాడబోమనే సంకేతం పార్టీ అధిష్టానం ఇస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**• బాబుగారి వ్యూహం... తమ్ముళ్లు తెల్లమొహం**

ఈ అన్ని విశ్లేషణలను బేరీజు వేసుకుంటే పార్టీలో చంద్రబాబు అంచనాలో వెనుకబడి ఉన్నవారు దాదాపు సగం మంది ఉన్నట్టే నంటూ లెక్కలు వినవస్తున్నాయి. ఆ ప్రకారం చూసుకుంటే గనక "సగం మందికి టికెట్లు కట్" అనే చర్చ ప్రస్తుతం టీడీపీలో బలంగా వినిపిస్తోంది., క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధుల పనితీరు ఆధారంగానే మార్పులు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం మాత్రం బలంగా వ్యక్తమవుతోంది. 2024 ఎన్నికల్లో సైతం అనేక కొత్త ముఖాలకు అవకాశం ఇచ్చిన టీడీపీ, అదే ధోరణిని 2029లో మరింత విస్తరించవచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం వ్యూహం వెనుక మరో ముఖ్యమైన రాజకీయ లక్ష్యం కూడా ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపక్షం మళ్లీ బలపడకుండా పార్టీని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచడం, అధికార వ్యతిరేకత పెరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవడం, ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, ప్రభుత్వ పనితీరుకు రాజకీయ బలం చేకూర్చడం... ఇవన్నీ ఒకే వ్యూహంలో భాగంగా కనిపిస్తున్నాయని విశ్లేషణలు సూచిస్తున్నాయి. రాబోయే మూడేళ్లు టీడీపీ ప్రజాప్రతినిధులకు అత్యంత కీలక కాలంగా మారే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రతి కార్యక్రమం, ప్రతి నిర్ణయం, ప్రతి ప్రజా స్పందన ఇప్పుడు రికార్డవుతున్న పరిస్థితి ఉందని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. నియోజకవర్గంలో చేసే చిన్న తప్పు కూడా అధిష్టానం దృష్టికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

> **• పనితీరే ప్రమాణం..!**
>
> టీడీపీలో ఇక సీనియారిటీ కంటే పనితీరుకే పెద్దపీట పడుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రజల్లో ఆదరణ, కార్యకర్తలతో అనుబంధం, అభివృద్ధి పనులు, ప్రజలకు అందుబాటు వంటి అంశాల ఆధారంగానే భవిష్యత్ రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని సమాచారం.
>
> **• సర్వేలే రిపోర్ట్ కార్డ్..!**
>
> ఒకే సర్వేపై కాకుండా ఇంటెలిజెన్స్ నివేదికలు, పార్టీ అంతర్గత సర్వేలు, ఐటీడీపీ విశ్లేషణలు, రాజకీయ వ్యూహకర్తల ఫీడ్‌బ్యాక్, క్షేత్రస్థాయి సమాచారం... అన్నింటినీ కలిపి ప్రతి ఎమ్మెల్యే, ఎంపీకి ప్రత్యేక రాజకీయ రిపోర్ట్ కార్డు సిద్ధమవుతోందని ప్రచారం జరుగుతోంది.
>
> **• 1999 ఫార్ములాపై చర్చ..!**
>
> ఎంపీల సమావేశంలో చంద్రబాబు 1999 ఎన్నికల వ్యూహాన్ని ప్రస్తావించడంతో పార్టీలో కొత్త చర్చ మొదలైంది. అప్పటిలాగే అవసరమైతే కొత్త ముఖాలకు పెద్దపీట వేయొచ్చనే సంకేతాలపై తమ్ముళ్లలో ఆసక్తితో పాటు ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.
>
> **• టికెట్‌కు ముందే టెస్ట్..!**
>
> 2029 ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ప్రజాప్రతినిధుల పనితీరుపై సమీక్షలు ప్రారంభించడం వెనుక అధికార వ్యతిరేకతను ముందుగానే అరికట్టాలన్న వ్యూహం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తుది నిర్ణయాలు ఎన్నికల సమయానికే తీసుకున్నా, ఇప్పటి నుంచే పనితీరు పరీక్ష మాత్రం మొదలైందనే అభిప్రాయం బలపడుతోంది.








## కీలకంగా మ్యాజిక్ ఫిగర్- ఓటింగ్‌పై ఎన్డీఏ బేఫికర్

అధికార పార్టీకి సంఖ్యా బలం ఉంది... కానీ పూర్తి భరోసా లేదు. ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉంది... కానీ ఐక్యత లేదు. ఒకవైపు బిల్లులు ఆమోదించాలన్న ప్రభుత్వ పట్టుదల... మరోవైపు వాటిని అడ్డుకోవాలన్న విపక్ష వ్యూహం. ఈ రెండింటి మధ్య అసలు పరీక్ష మాత్రం ప్రజల ఆశలదే. నేటి నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల వేదికగా మాత్రమే మిగిలిపోతాయా? లేక దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలకు వేదిక అవుతాయా? అన్న ప్రశ్న ఇప్పుడు దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. అధికార కూటమి సంఖ్యాబలం గతంతో పోలిస్తే పెరిగింది. అయినా రాజ్యాంగ సవరణ బిల్లులకు అవసరమైన మెజారిటీ ఇంకా సవాలుగానే ఉంది. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలు చాలానే ఉన్నాయి. కానీ ఆ అంశాలను ఒక్క గొంతుతో వినిపించే బలం మాత్రం బలహీనపడింది. చీలికలు, ఫిరాయింపులు, ఎన్నికల పరాజయాలు విపక్షాన్ని దెబ్బతీశాయి. ఇదే సమయంలో ధరలు, ఉపాధి, విద్య, రైతులు, ఆర్థిక వ్యవస్థ, పారదర్శక పాలన వంటి ప్రజల అసలు సమస్యలకు పార్లమెంట్ ఎంత సమయం కేటాయిస్తుందన్నదే కీలకం. రామాలయ విరాళాల వివాదం, నీట్ అక్రమాల ఆరోపణలు, విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు, ఆదాయపు పన్ను సవరణ వంటి అంశాలపై ప్రతిపక్షం గట్టిగా నిలబడనుంది. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలు, మహిళా రిజర్వేషన్ అమలు, రాజ్యాంగ సవరణకు అవసరమైన రెండు మూడవ వంతుల మెజారిటీ వంటి అంశాలు ఈ సమావేశాల ప్రధాన ఆకర్షణగా మారనున్నాయి.  నెంబర్ గేమ్‌లో గెలిచేది ప్రభుత్వం కావొచ్చు... వ్యూహాల్లో పైచేయి సాధించేది ప్రతిపక్షం కావొచ్చు... కానీ చివరికి ప్రజల సమస్యలే సభలో గెలిస్తేనే ఈ సమావేశాలకు నిజమైన అర్థం ఉంటుంది.  బిల్లుల భవితవ్యంతో పాటు సంఖ్యాబలం చుట్టూ తిరిగే రాజకీయ వ్యూహాలు ఈ వర్షాకాల సమావేశాలను అత్యంత ఉత్కంఠభరితంగా మార్చనున్నాయి.

# పార్లమెంట్‌లో బిగ్ ఫైట్!

- నెంబర్స్ మైండ్ గేమ్
- పార్టీలకు వర్షాకాల హీట్
- కొత్త సమీకరణాల బీట్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. మరోవైపు ప్రతిపక్షం కూడా కేంద్రాన్ని ఇబ్బందుల్లోకి నెట్టే అంశాలతో వ్యూహం సిద్ధం చేసింది. గత బడ్జెట్ సమావేశాల్లో నిలిచిపోయిన మహిళా రిజర్వేషన్ అమలు కోసం డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును మళ్లీ తీసుకురావాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈసారి సభలో సంఖ్యాబలం మారడం, ప్రతిపక్షంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు మొత్తం సమీకరణాలను మార్చేశాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఆరు ప్రధాన బిల్లులను ముందుకు తీసుకురానుంది. విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లు, ఆదాయపు పన్ను సవరణ బిల్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లు, జనన మరణాల నమోదు చట్ట సవరణ, జాతీయ గౌరవ పరిరక్షణ చట్ట మార్పులు, సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్ట సవరణ వంటి బిల్లులు జాబితాలో ఉన్నాయి. పరిపాలనలో పారదర్శకత పెంపు, న్యాయవ్యవస్థ సామర్థ్యం విస్తరణ, వ్యాపార వాతావరణం మెరుగుదల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను వివరిస్తోంది.

**• ఎఫ్‌సీఆర్ఏ బిల్లు, ఆదాయపు పన్ను నుంచి సుప్రీంకోర్టు వరకు**

అన్ని బిల్లుల్లో విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ అత్యధిక చర్చకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగంపై మరింత పారదర్శకత తీసుకురావాలన్నదే ప్రభుత్వ వాదన. అయితే ప్రతిపక్షం మాత్రం ఈ మార్పులు ముఖ్యంగా క్రైస్తవ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను టార్గెట్ చేస్తున్నవేనని ఆరోపిస్తోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఆదాయపు పన్ను ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లును కూడా ప్రభుత్వం ఈ సమావేశాల్లో ఆమోదింపజేయాలని చూస్తోంది. ప్రస్తుతం 33 మంది న్యాయమూర్తులతో ఉన్న సుప్రీంకోర్టులో సంఖ్యను 37కు పెంచే ప్రతిపాదన కూడా ఉంది. జనన, మరణాల ఆలస్య నమోదు నిబంధనలను కఠినతరం చేయడం, జాతీయ గౌరవానికి అవమానం కలిగించే చర్యలపై శిక్షలను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఈలకు చెల్లింపుల ఆలస్యంపై కఠిన నిబంధనలు తీసుకురావడం వంటి అంశాలు కూడా ప్రభుత్వ ప్రాధాన్యత జాబితాలో ఉన్నాయి.

**• రామాలయ విరాళాల అంశం**

ప్రభుత్వం బిల్లులపై దృష్టి పెట్టగా ప్రతిపక్షం రాజకీయ అంశాలపై దాడికి సిద్ధమైంది. సమావేశాలకు ముందు జరిగిన అఖిలపక్ష సమావేశం నుంచే ప్రతిపక్షం వాకౌట్ చేయడం ఉద్రిక్తతకు సంకేతంగా మారింది. తిరుగుబాటు చేసిన తృణమూల్ ఎంపీలకు ఆహ్వానం ఇవ్వడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షం బయటకు వెళ్లిపోయింది. అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, నీట్ పరీక్ష వివాదం, పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం వంటి అంశాలపై చర్చ కోరుతోంది. రామాలయ విరాళాల దుర్వినియోగంపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశాన్ని లోక్‌సభ, రాజ్యసభలో లేవనెత్తాలని నిర్ణయించాయి. కేంద్రం మాత్రం ఇది ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని అంశమని చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రతిపక్షం ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది.

**• సభలో ప్రతిధ్వనించనున్న నీట్ వివాదం**

నీట్ పరీక్షలో అక్రమాల ఆరోపణలు కూడా ఈ సమావేశాల్లో ప్రధాన చర్చగా మారనున్నాయి. నిరసన కార్యక్రమాలు ఇప్పటికే ఢిల్లీలో ఊపందుకున్నాయి. నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్‌చుక్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించడం తర్వాత ఉద్యమం మరింత ఉధృతమైంది. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ప్రతిపక్షం పట్టుబట్టే అవకాశం ఉంది. గత బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తొలిసారి గట్టి ఎదురుదెబ్బ ఎదుర్కొంది. మహిళా రిజర్వేషన్ అమలుకు అవసరమైన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు రెండు మూడో వంతుల మెజారిటీ సాధించలేకపోయింది. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 550 నుంచి 850కు పెంచే ప్రతిపాదన కూడా అందులో భాగంగా ఉంది. అవసరమైన సంఖ్య లేకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు.

**• దక్షిణాది రాష్ట్రాల ఆందోళన, మోదీ హామీ**

డీలిమిటేషన్ విషయంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా స్థానాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందని ప్రాంతీయ పార్టీలు వాదించాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నాయి. తమ రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. ఈ విమర్శలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత సమావేశాల్లోనే సమాధానం ఇచ్చారు. మహిళలకు అదనంగా స్థానాలు కల్పించడం వల్ల రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న స్థానాల నిష్పత్తిలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ప్రతి రాష్ట్రానికి ఉన్న వాటా అలాగే కొనసాగుతుందని హామీ ఇచ్చారు. మంచి ఉద్దేశంతో తీసుకొస్తున్న చట్టాన్ని అపార్థం చేసుకోవద్దని ఆయన పేర్కొన్నారు. కానీ తాజాగా మరోసారి బిల్లు ప్రవేశపెడితే మొత్తం పరిణామాలు ఎలా చోటుచేసుకుంటాయోనన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అంతా అనుకూలంగా ఉన్నా.. ఇంకో ఏదో ఉందన్న భావన అధికారాపక్షాన్ని వేధిస్తోంది.

**• మూడు నెలల్లో మారిన రాజకీయ చిత్రం**

బడ్జెట్ సమావేశాల తర్వాత దేశ రాజకీయాల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష కూటమిలో వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమి పాలైంది. తమిళనాడులో డీఎంకే అధికారాన్ని కోల్పోయింది. కేరళలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ ఫలితాలు ప్రతిపక్ష ఐక్యతపై తీవ్ర ప్రభావం చూపించాయి. ఎన్నికల తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున తిరుగుబాటు జరిగింది. 28 మంది ఎంపీల్లో 20 మంది పార్టీని వీడి కొత్త రాజకీయ దారిని ఎంచుకున్నారు. ఈ పరిణామం జాతీయ రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది. లోక్‌సభలో ఎన్డీయే బలం గణనీయంగా పెరగడానికి ఇదే ప్రధాన కారణంగా మారింది. తమిళనాడులో వచ్చిన ఫలితాల తర్వాత కాంగ్రెస్, డీఎంకే మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ ఏర్పాటు కోసం కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడం డీఎంకేకు నచ్చలేదు. దీంతో రెండు పార్టీల మధ్య దూరం పెరిగింది. ఐఎన్‌డీఐఏ కూటమి ఐక్యతపై కూడా దీని ప్రభావం పడింది. శివసేన (ఉద్ధవ్ వర్గం) మరోసారి చీలికను ఎదుర్కొంది. పలువురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరారు. దీంతో ప్రతిపక్ష బలం మరింత తగ్గిపోయింది. అధికార కూటమి మాత్రం ఈ పరిణామాలను రాజకీయంగా తమకు అనుకూలంగా మార్చుకుంది.

**• మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?**


ప్రభుత్వం అధికారికంగా డీలిమిటేషన్ బిల్లును జాబితాలో చేర్చకపోయినా దాన్ని మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రాంతీయ పార్టీల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని కొన్ని మార్పులు చేసే అవకాశముందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైన మద్దతు కూడగట్టేందుకు సంప్రదింపులు కొనసాగుతున్నాయి. లోక్‌సభలో ప్రస్తుత సభ్యుల సంఖ్య 540. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు అవసరం. గతసారి బిల్లుకు 298 మంది అనుకూలంగా ఓటు వేయగా 230 మంది వ్యతిరేకించారు. ఇప్పుడు ఎన్డీయేకు 293 మంది సభ్యుల మద్దతు ఉంది. తిరుగుబాటు చేసిన ఎంపీలు చేరడంతో ఆ సంఖ్య 319కు పెరిగింది.

**• వైఎస్సార్‌సీపీ మద్దతు కీలకం**

నాలుగు మంది లోక్‌సభ సభ్యులు ఉన్న వైఎస్సార్‌సీపీ మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్ణయం ప్రకారం ఈ బిల్లులకు అనుకూలంగా ఓటేస్తామని పార్టీ ఎంపీలు స్పష్టం చేశారు. ఇతర బిల్లుల విషయంలో మాత్రం వాటి అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని  ఆ పార్టీ చెబుతోంది. ఎన్‌సీపీ (శరద్ పవార్ వర్గం), శివసేన (ఉద్ధవ్ వర్గం), డీఎంకే వంటి పార్టీలు తమ అభ్యంతరాలు పరిష్కరిస్తే మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న సంకేతాలు ఇచ్చాయి. అన్ని రాష్ట్రాలకు సమానంగా స్థానాల పెంపు ఉంటే వ్యతిరేకించే అవసరం ఉండదని సుప్రియా సూలే పేర్కొన్నారు. తమ సూచనలు పరిగణనలోకి తీసుకుంటే నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తామని సంజయ్ రౌత్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల వాటాపై స్పష్టత ఇస్తే చర్చలకు సిద్ధమని డీఎంకే నాయకత్వం కూడా వెల్లడించింది.

**• అడ్డంకి ఇంకా మిగిలే ఉంది**

ఈ అన్ని పార్టీల మద్దతు వచ్చినా ప్రభుత్వం మూడొంతుల మెజారిటీకి కొద్దిగా దూరంలోనే ఉంటుంది. అయితే సభలో హాజరై ఓటు వేసిన సభ్యుల ఆధారంగానే అవసరమైన సంఖ్య నిర్ణయించబడుతుంది. కొంతమంది సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుంది. ఈ అంశంపైనే అధికార కూటమి దృష్టి పెట్టింది. ఈ వర్షాకాల సమావేశాలు సాధారణ శాసన కార్యక్రమాలకే పరిమితం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవైపు కీలక చట్టాల ఆమోదం, మరోవైపు ప్రతిపక్ష నిరసనలు, డీలిమిటేషన్ చుట్టూ కొనసాగుతున్న రాజకీయ సమీకరణాలు దేశ రాజకీయాలకు కొత్త దిశ చూపే అవకాశం ఉంది. సంఖ్యాబలం మారిన తర్వాత జరిగే తొలి కీలక సమావేశం కావడంతో ప్రతి రోజు ఉత్కంఠభరితంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. పార్లమెంట్ లో జరిగే చర్చలు, బిల్లుల భవిష్యత్తు, ప్రతిపక్ష వ్యూహాలు, అధికార కూటమి లెక్కలు కలిసి దేశ రాజకీయాలను వచ్చే నెలల్లో ప్రభావితం చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.











## లీడ్ పాయింట్స్

❖ బిల్లుల కంటే సంఖ్యలపైనే ఫోకస్
ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అసలు పోరు బిల్లులపై కంటే సంఖ్యాబలంపైనే సాగనుంది. రాజ్యాంగ సవరణలకు అవసరమైన మెజారిటీ సాధించడమే అధికార కూటమి ముందున్న అతిపెద్ద సవాలు.

❖ ప్రభుత్వానికి కొత్త ఆశలు
ప్రతిపక్షంలో చీలికలు, ఫిరాయింపులు, ప్రాంతీయ పార్టీల వైఖరిలో మార్పులతో కేంద్ర ప్రభుత్వం గతం కంటే బలమైన స్థితిలో ఉంది. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై మరోసారి ముందడుగు వేయాలని చూస్తోంది.

❖ ప్రతిపక్షం ఎదురుదాడికి సిద్ధం
రామాలయ విరాళాల వ్యవహారం, నీట్ పరీక్ష వివాదం, విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ, పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం వంటి అంశాలతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం వ్యూహం సిద్ధం చేసింది.

❖దేశ రాజకీయాలకు కీలక మలుపు
ఈ సమావేశాల్లో జరిగే చర్చలు, బిల్లులపై ఓటింగ్, పార్టీల వైఖరి రానున్న రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంఖ్యల సమీకరణమే చివరికి విజయం నిర్ణయించనుంది.



## సంఖ్య బలంలో ఎవరిది పైచేయి?

ఈ వర్షాకాల సమావేశాలు కేవలం బిల్లుల ఆమోదం కోసం జరిగే శాసన ప్రక్రియగా మాత్రమే నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. అధికార కూటమి బలం ఎంత పెరిగిందో, ప్రతిపక్షం ఎంత మేరకు ఐక్యంగా నిలబడగలదో పరీక్షించే రాజకీయ వేదికగా మారనున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల భవితవ్యం సభలోని సంఖ్యలపై ఆధారపడనుంది. ప్రాంతీయ పార్టీల వైఖరి, తటస్థ సభ్యుల నిర్ణయాలు, ఓటింగ్ సమయంలో జరిగే రాజకీయ పరిణామాలు తుది ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నాయి. ఒకవైపు కీలక సంస్కరణలను అమలు చేయాలన్న ప్రభుత్వ పట్టుదల, మరోవైపు సమాఖ్య స్ఫూర్తి, రాష్ట్రాల ప్రయోజనాల పేరుతో ప్రతిపక్షం వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు సభలో తీవ్ర చర్చకు దారితీయనున్నాయి. ప్రతి బిల్లు రాజకీయంగా కొత్త సందేశాన్ని ఇవ్వొచ్చు. ప్రతి ఓటు ప్రభుత్వానికి బలం చేకూర్చొచ్చు లేదా ప్రతిపక్షానికి ఊపిరి పోయొచ్చు. అందుకే ఈ సమావేశాల ఫలితం ప్రస్తుత రాజకీయాలకే కాదు, రానున్న ఎన్నికల వ్యూహాలకు కూడా దిశానిర్దేశం చేసే అవకాశాలు ఉన్నాయి. ఢిల్లీలో మొదలయ్యే ఈ సంఖ్యల సమరం చివరకు దేశ రాజకీయాల భవిష్యత్తును ఎంత మేరకు ప్రభావితం చేస్తుందన్నదే ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.



# విశ్వవిజేత స్పెయిన్

**• చెదిరిన మెస్సీ కల • టోరెస్ గోల్‌తో టైటిల్**
**• అర్జెంటీనాకు షాక్ • స్పెయిన్‌కు సెకండ్ కప్**

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చరిత్ర సృష్టించింది. న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో అర్జెంటీనాను 10తో ఓడించి ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది. అదనపు సమయంలో 106వ నిమిషంలో ఫెర్రాన్ టోరెస్ చేసిన ఏకైక గోల్ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించింది. 2010 తర్వాత మరోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న స్పెయిన్, రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది.

స్పెయిన్ పూర్తి ఆధిపత్యం మ్యాచ్ మొత్తం స్పెయిన్ ఆటపై పూర్తి నియంత్రణ ప్రదర్శించింది. 65 శాతం బంతిని తన ఆధీనంలో ఉంచుకొని వరుసగా దాడులు చేసింది. మొత్తం 20 షాట్లు కొట్టిన స్పెయిన్, అర్జెంటీనాకు మాత్రం రెండు అవకాశాలే ఇచ్చింది. అదనపు సమయంలో నికో విలియమ్స్ చేసిన గోల్ ఫౌల్ కారణంగా రద్దు అయినా, స్పెయిన్ వెనక్కి తగ్గలేదు. చివరకు టోరెస్ గోల్‌తో విజయాన్ని ఖాయం చేసింది.

### మెస్సీ జట్టుకు భారీ దెబ్బ

అర్జెంటీనా మధ్యమైదాన ఆటగాడు ఎంజో ఫెర్నాండెజ్ రెండు పసుపు కార్డులతో మైదానం వీడటం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. మరోవైపు డిఫెండర్ లిసాండ్రో మార్టినెజ్ గాయంతో బయటకు వెళ్లడంతో జట్టు మరింత బలహీనపడింది. తక్కువ మంది ఆటగాళ్లతో చివరి నిమిషాలు ఆడాల్సి రావడంతో అర్జెంటీనా ఒత్తిడిని తట్టుకోలేకపోయింది.

మెస్సీ నాయకత్వంలోని జట్టు చివరికి మరోసారి ప్రపంచకప్ గెలవాలన్న ఆశను నెరవేర్చుకోలేకపోయింది.

మార్టినెజ్ పోరాటం వృథా

అర్జెంటీనా గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ అసాధారణ ప్రదర్శన చేశాడు. ఏకంగా 11 సేవ్‌లు చేసి ప్రపంచకప్ ఫైనల్ చరిత్రలో కొత్త రికార్డు నమోదు చేశాడు. అతని అద్భుత ప్రయత్నాల వల్లే మ్యాచ్ చాలా సేపు గోల్‌లేకుండా కొనసాగింది. అయినా టోరెస్ గోల్‌ను అడ్డుకోలేకపోయాడు. ప్రారంభ వేడుకల్లో పోస్ట్ మలోన్, ఐషోస్పీడ్ సందడి చేయగా, హాఫ్‌టైమ్ షోలో జస్టిన్ బీబర్, షకీరా, బీటీఎస్ ప్రదర్శనలు అభిమానులను అలరించాయి. చివరికి ప్రపంచ పుట్ బాల్ సింహాసనంపై స్పెయిన్ మరోసారి తన జెండా ఎగురవేసింది.


**ప్రపంచ ఫుట్‌బాల్‌కు మరో కొత్త చక్రవర్తి దొరికాడు. మెస్సీ అర్జెంటీనాను మట్టికరిపిస్తూ స్పెయిన్ మరోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. న్యూజెర్సీలో జరిగిన ఫిఫా ప్రపంచకప్-2026 ఫైనల్ ఉత్కంఠకు పరాకాష్టగా నిలిచింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్ చేయలేకపోయినా, అదనపు సమయంలో ఫెర్రాన్ టోరెస్ ఒక్క గోల్‌తో చరిత్రను తిరగరాశాడు. ఆ గోల్ స్పెయిన్‌కు రెండో ప్రపంచకప్‌ను అందించగా, వరుసగా రెండోసారి విశ్వవిజేత కావాలన్న అర్జెంటీనా ఆశలను ఛిద్రం చేసింది. మ్యాచ్ మొత్తం బంతిపై ఆధిపత్యం, కచ్చితమైన పాస్‌లు, ఉక్కు వంటి రక్షణతో స్పెయిన్ ప్రత్యర్థికి ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. ఎంజో ఫెర్నాండెజ్ రెడ్ కార్డు అర్జెంటీనాను మరింత బలహీనపరచగా, మెస్సీ కలలకు చివరికి తెరపడింది. యూరో-2024 తర్వాత ప్రపంచకప్-2026ను కూడా గెలుచుకున్న స్పెయిన్, ఈ తరం అత్యుత్తమ జట్టిగా తన ముద్ర వేసింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లో స్పానిష్ సింహగర్జన మరోసారి మార్మోగింది.**



## స్పెయిన్ పవర్‌ఫుల్ ప్లే

**ప్రపంచం ఫుట్‌బాల్‌పై చెరగని ముద్ర!**

ప్రపంచకప్ ఫైనల్ అంటే సాధారణంగా ఇరు జట్లు సమానంగా పోరాడే మ్యాచ్. కానీ ఫిఫా ప్రపంచకప్2026 ఫైనల్లో స్పెయిన్ ఆట మరో స్థాయిలో కనిపించింది. ప్రారంభ విజిల్ నుంచే బంతిపై పూర్తి ఆధిపత్యం సాధించిన స్పానిష్ జట్టు, వేగవంతమైన పాస్‌లు, కచ్చితమైన మిడ్‌ఫీల్డ్ నియంత్రణ, ఉక్కు వంటి రక్షణతో అర్జెంటీనాను పూర్తిగా కట్టడి చేసింది. మెస్సీ నాయకత్వంలోని జట్టుకు ఒక్కసారి కూడా స్వేచ్ఛగా దాడి చేసే అవకాశం ఇవ్వలేదు. మధ్యమైదానంలో పెడ్రి, రోడ్రి, సహచరుల సమన్వయం స్పెయిన్‌కు పెద్ద బలంగా మారింది. ప్రతి దాడిని క్రమబద్ధంగా నిర్మిస్తూ అర్జెంటీనా డిఫెన్స్‌పై నిరంతరం ఒత్తిడి తీసుకొచ్చింది. మరోవైపు స్పెయిన్ డిఫెన్స్ మెస్సీ కదలికలను పూర్తిగా నియంత్రించింది. అర్జెంటీనా స్టార్ ఫార్వర్డ్‌లను ఖాళీ ప్రదేశాలు దొరకకుండా కట్టుదిట్టంగా మార్క్ చేసింది. నిర్ణీత 90 నిమిషాల్లో గోల్ రాకపోయినా స్పెయిన్ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. అదనపు సమయంలో కూడా అదే దూకుడును కొనసాగించింది. 105వ నిమిషంలో నికో విలియమ్స్ అందించిన అద్భుత అవకాశాన్ని ఫెర్రాన్ టోరెస్ ఎడమ కాలితో గోల్‌గా మలిచాడు. ఆ ఒక్క షాట్ ప్రపంచకప్‌ను స్పెయిన్ ఒడిలోకి చేర్చింది. యూరో2024 టైటిల్ తర్వాత ప్రపంచకప్2026ను కూడా గెలిచిన స్పెయిన్, సమష్టి ఆటే విజయానికి అసలైన సూత్రమని మరోసారి నిరూపించింది. స్టార్ ఆటగాళ్లపై మాత్రమే ఆధారపడకుండా, ప్రతి విభాగంలో క్రమశిక్షణతో ఆడి ప్రపంచ ఫుట్ బాల్‌కు కొత్త ప్రమాణాన్ని చూపించింది. స్పెయిన్ విజయం ఒక గోల్ కథ మాత్రమే కాదు... అది వ్యూహం, సహనం, ఆధిపత్యం, జట్టు ఆట కలిసొచ్చిన పరిపూర్ణ ఛాంపియన్ ప్రదర్శన.



## వరల్డ్‌కప్ ఫైనల్‌కు ట్రంప్

**ఇటు చప్పట్లు.. అటు హేళనలు**

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియానికి మెరైన్ వన్ హెలికాప్టర్‌లో చేరుకున్న ట్రంప్, స్పెయిన్-అర్జెంటీనా ఫైనల్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌తో కలిసి వీఐపీ బాక్స్‌లో కూర్చున్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు అమెరికా జాతీయ గీతం సందర్భంగా లేచి గౌరవం తెలిపారు.

### స్క్రీన్‌పై కనిపించగానే ఛీత్కారాలు

మ్యాచ్ మధ్యలో స్టేడియంలోని భారీ తెరపై ట్రంప్ చిత్రం కనిపించగానే ప్రేక్షకుల నుంచి కొంతమంది హేళన చేశారు. మరోవైపు పలువురు చప్పట్లతో స్వాగతించారు. గతంలో కొన్ని క్రీడా పోటీల్లో ఎదురైన తీవ్ర వ్యతిరేకతతో పోలిస్తే ఈసారి వ్యతిరేకత తక్కువగానే కన్పించింది దీంతో ట్రంప్‌కు స్టేడియంలో మిశ్రమ స్పందన లభించింది.

### మెస్సీపైనే ట్రంప్ నమ్మకం

మ్యాచ్ ప్రారంభానికి ముందు ట్రంప్ తన అంచనాను వెల్లడించారు. లియోనెల్ మెస్సీ ఉన్న అర్జెంటీనాను తక్కువ అంచనా వేయలేమని వ్యాఖ్యానించారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే తన స్నేహితుడని, ఆయన మంచి పని చేస్తున్నారని కూడా చెప్పారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో ట్రంప్ కరచాలనం చేయడం కూడా ప్రత్యేకంగా కనిపించింది.



## లార్డ్స్‌లో ప్రపంచ రికార్డ్

**387 పరుగులతో సంచలనం • డకెట్ అద్భుత ఇన్నింగ్స్**

లార్డ్స్ వేదికగా జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో ఇంగ్లండ్ బ్యాటర్లు భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లకు 387 పరుగులు చేసి లార్డ్స్ మైదానంలో లిస్ట్‌ఏ క్రికెట్ చరిత్రలో అత్యధిక స్కోరు నమోదు చేశారు. ఈ ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. భారీ స్కోరుతో భారత్ ముందు కఠిన లక్ష్యాన్ని ఉంచింది. ఓపెనర్ బెన్ డకెట్ 135 బంతుల్లో 141 పరుగులు చేసి ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 18 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. జేకబ్ బెథెల్ 91 పరుగులతో అద్భుతంగా రాణించాడు. తొలి వికెట్‌కు ఇద్దరూ కలిసి 192 పరుగులు జోడించి భారత బౌలర్లను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టారు. ఇది భారత్‌పై ఇంగ్లండ్ తరఫున అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యంగా నిలిచింది. జో రూట్ 71 పరుగులతో ఇన్నింగ్స్‌ను మరింత బలపరిచాడు. చివర్లో జోస్ బట్లర్ కేవలం 13 బంతుల్లో 41 పరుగులు చేసి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చివరి పది ఓవర్లలో ఇంగ్లండ్ 126 పరుగులు రాబట్టగా, చివరి ఐదు ఓవర్లలోనే 82 పరుగులు సాధించింది. ఈ దూకుడు స్కోరును 387కు చేర్చింది. జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా దూరం కావడం భారత్‌కు పెద్ద దెబ్బగా మారింది. యువ పేసర్లు లైన్, లెంగ్త్‌పై నియంత్రణ కోల్పోయారు. మొత్తం 26 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. గుర్నూర్ బ్రార్ 97 పరుగులు ఇచ్చి లార్డ్స్‌లో అత్యంత ఖరీదైన బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. అనుభవం లేని బౌలింగ్ దళం ముందు ఇంగ్లండ్ బ్యాటర్లు స్వేచ్ఛగా పరుగుల వరద పారించడంతో భారత్ భారీ ఒత్తిడిలో పడింది.

## రోహిత్ పోరాడినా.. చేజారిన సిరీస్!

**◆ సెంచరీ వృథా, ఇంగ్లండ్‌కు విక్టరీ**
**◆ విమర్శలకు బ్యాట్‌తో సమాధానం**

రిటైర్మెంట్ ఊహాగానాలు, తీవ్ర విమర్శల మధ్య భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ లార్డ్స్ వేదికగా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మూడో వన్డేలో 138 పరుగులతో చెలరేగి తనపై వచ్చిన సందేహాలకు బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. ఇదే అతడి కెరీర్‌లో 34వ వన్డే సెంచరీ. లార్డ్స్‌లో వన్డే శతకం సాధించిన తొలి భారత బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 77 పరుగులు, విరాట్ కోహ్లి 74 పరుగులతో చక్కటి సహకారం అందించారు.

### భారీ లక్ష్యం.. చివరికి ఓటమి

ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 388 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ముందు ఉంచింది. బెన్ డకెట్ 142 పరుగులతో చెలరేగగా, జేకబ్ బెథెల్ 91 పరుగులు చేశాడు. చివర్లో జోస్ బట్లర్ కేవలం 13 బంతుల్లో 41 పరుగులు చేసి ఇంగ్లండ్ స్కోరును మరింత పెంచాడు. లక్ష్య ఛేదనలో భారత్ 7 వికెట్లకు 360 పరుగులకే పరిమితమైంది. దీంతో 27 పరుగుల తేడాతో ఓటమి పాలై సిరీస్‌ను 21తో కోల్పోయింది.

### బౌలింగ్ వైఫల్యం ప్రభావం

జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా జట్టుకు దూరం కావడం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపింది. యువ పేసర్లు అనుభవలేమితో పరుగులను నియంత్రించలేకపోయారు. నాలుగు మంది పేసర్లు కలిసినా ఇంగ్లండ్ బ్యాటర్లను ఒత్తిడిలో పెట్టలేకపోయారు. రెండో స్పిన్నర్ లేకపోవడం కూడా భారత్‌కు ప్రతికూలంగా మారింది. భారీ స్కోరు సమర్పించుకోవడం చివరికి ఓటమికి ప్రధాన కారణమైంది.

### రోహిత్ క్లాస్ మరోసారి రుజువు

సిరీస్ భారత్ చేతులెత్తేసినా రోహిత్ శర్మ ఇన్నింగ్స్ అభిమానుల మనసులు గెలుచుకుంది. తీవ్ర ఒత్తిడిలో నిలబడి ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక మైదానాల్లో ఒకటైన లార్డ్స్‌లో చారిత్రక సెంచరీ సాధించడం అతడి గొప్పతనాన్ని మరోసారి నిరూపించింది. ఓటమి బాధ మిగిలినా, రోహిత్ పోరాటం మాత్రం భారత క్రికెట్ అభిమానులకు చిరస్మరణీయంగా నిలిచిపోనుంది.

## రిటైర్మెంట్ రూమర్లకు సమాధానం!

**లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన రోహిత్**

గత కొద్ది రోజులుగా భారత క్రికెట్‌లో అత్యంత చర్చనీయాంశంగా మారింది రోహిత్ శర్మ భవిష్యత్తు. ఇంగ్లండ్‌తో రెండో వన్డే ఓటమి తర్వాత అతడిని ఇక ఎంపిక చేయకపోవచ్చని, మూడో వన్డేనే చివరి మ్యాచ్ కావచ్చని ప్రచారం జోరుగా సాగింది. ఈ వార్తలు అభిమానుల్లో ఆందోళన కలిగించాయి. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్వయంగా స్పందించి, రోహిత్ కోరుకున్నంత కాలం భారత జట్టుకు ఆడతాడని స్పష్టం చేశారు. దీంతో రిటైర్మెంట్ ఊహాగానాలకు అధికారికంగా తెరపడింది.

### లార్డ్స్‌లో చరిత్రాత్మక సెంచరీ

ఈ నేపథ్యంలో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డేలో రోహిత్ శర్మ తన బ్యాట్‌తోనే విమర్శకులకు సమాధానం ఇచ్చాడు. 388 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అద్భుతమైన సెంచరీ సాధించాడు. వన్డేల్లో లార్డ్స్ మైదానంలో శతకం బాదిన తొలి భారత బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇప్పటి వరకు ఈ వేదికపై భారత ఆటగాడి అత్యధిక స్కోరు 90 పరుగులు మాత్రమే. ఆ రికార్డును రోహిత్ చెరిపేశాడు.

### సచిన్, విరాట్‌కు లేని ఘనత

39 సంవత్సరాల 80 రోజుల వయసులో లార్డ్స్‌లో వన్డే సెంచరీ చేసిన అత్యంత వయోవృద్ధ ఆటగాడిగా రోహిత్ మరో అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఈ ఘనత ఇప్పటి వరకు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి వంటి దిగ్గజాలకు కూడా దక్కలేదు. లార్డ్స్‌లో అన్ని ఫార్మాట్లలో అంతర్జాతీయ సెంచరీ చేసిన అత్యంత వయోవృద్ధ భారత క్రికెటర్‌గా కూడా నిలిచాడు. దీంతో రోహిత్ మరోసారి తన క్లాస్‌ను ప్రపంచానికి చాటిచెప్పాడు.

### భారత్‌కు భారీ సవాల్


ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 3 వికెట్ల నష్టానికి 387 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. బెన్ డకెట్ 141 పరుగులతో చెలరేగగా, జేకబ్ బెథెల్ 91 పరుగులతో అద్భుత భాగస్వామ్యం నిర్మించాడు. ఇద్దరూ తొలి వికెట్‌కు 192 పరుగులు జోడించి భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. జస్ప్రీత్ బుమ్రా మోకాలి గాయం కారణంగా దూరం కావడం భారత జట్టుకు పెద్ద దెబ్బగా మారింది.

### ఒక్కడి పోరాటం సరిపోలేదు

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ శర్మ అసాధారణ ఇన్నింగ్స్ ఆడినా మిగతా బ్యాటర్ల నుంచి ఆశించిన స్థాయి సహకారం రాలేదు. ఫలితంగా భారత్ మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను కూడా 21 తేడాతో చేజార్చుకుంది. అయినా రోహిత్ సెంచరీ మాత్రం ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిటైర్మెంట్ చర్చలు, ఎంపికలపై సందేహాలు, విమర్శల మధ్య బ్యాట్‌తో ఇచ్చిన ఈ సమాధానం అతని అనుభవం, మానసిక దృఢత్వానికి నిదర్శనంగా నిలిచిపోయింది. అభిమానుల దృష్టిలో రోహిత్ శర్మ ఇంకా భారత జట్టుకు కీలక బలమేనని ఈ ఇన్నింగ్స్ మరోసారి నిరూపించింది.

## జపాన్ ఓపెన్ సింధుదే..

**జగన్నాథుడికి అంకితం!**
**రథయాత్ర రోజున గెలుపు • చరిత్ర సృష్టించిన పీవీ సింధు**



భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీని గెలిచిన తొలి భారత షట్లర్‌గా నిలిచింది. ఫైనల్లో ఆతిథ్య దేశానికి చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ అకానే యమగుచిని వరుస సెట్లలో ఓడించి విజేతగా నిలిచింది. దాదాపు రెండేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను అందుకోవడం సింధుకు ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చింది.

### జగన్నాథుడి ఆశీస్సులే కారణం

తన విజయాన్ని మహాప్రభు జగన్నాథుడికి అంకితం చేస్తున్నట్లు సింధు వెల్లడించింది. ఈ విజయం ఒడిశాలో జరుగుతున్న పవిత్ర జగన్నాథ రథయాత్ర సమయంలో రావడం ఎంతో ప్రత్యేకంగా అనిపించిందని తెలిపింది. త్వరలోనే పూరీకి వెళ్లి జగన్నాథ స్వామి ఆలయంలో దర్శనం చేసుకుని ఆశీస్సులు తీసుకోవాలని తన కోరికను వెల్లడించింది. ఈ విజయం తన జీవితంలో మరపురాని ఘట్టంగా నిలిచిపోతుందని పేర్కొంది.

### నవీన్ పట్నాయక్ అభినందనలు

ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోషల్ మీడియా ద్వారా సింధుకు అభినందనలు తెలిపారు. జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన తొలి భారత క్రీడాకారిణిగా దేశానికి గర్వకారణంగా నిలిచిందని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి భారత కీర్తిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ సందేశానికి స్పందించిన సింధు ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది. తన మామగారు ఒడిశా పరిపాలన గురించి ఎంతో గొప్పగా చెప్పేవారని గుర్తుచేసుకుంది.

మళ్లీ టైటిల్ రేసులో సింధు 2022 సింగపూర్ ఓపెన్ తర్వాత సింధు పెద్ద టైటిల్ కోసం ఎదురుచూస్తోంది. ఈ విజయంతో ఆ నిరీక్షణకు ముగింపు పడింది. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ గెలుపు ఆమె ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. అనుభవం, పట్టుదల, పోరాట స్ఫూర్తితో సింధు మరోసారి ప్రపంచ స్థాయి టైటిళ్ల కోసం సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చింది. భారత బ్యాడ్మింటన్ అభిమానులకు ఈ విజయం కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది.

## కన్నీళ్లతో సింధు సంబరం

**◆ నమ్మకమే విజయ రహస్యం!**
**◆ ఆత్మవిశ్వాసమే ఆయుధం**
**◆ జపాన్ ఓపెన్‌లో చరిత్ర**

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచి భావోద్వేగానికి గురైంది. దాదాపు రెండేళ్ల టైటిల్ నిరీక్షణకు తెరదించి తన కెరీర్‌లో ఆరు సంవత్సరాల తర్వాత అతిపెద్ద విజయాన్ని అందుకుంది. ఫైనల్లో ఆతిథ్య దేశానికి చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ అకానే యమగుచిని 2117, 2117 తేడాతో వరుస సెట్లలో ఓడించి విజేతగా నిలిచింది. విజయం అనంతరం తన కళ్లలో ఆనందబాష్పాలు వచ్చాయని సింధు వెల్లడించింది.

### నమ్మకం ఎప్పుడూ కోల్పోలేదు

తనపై ఎన్నో సందేహాలు వ్యక్తమైనా, తాను మాత్రం ఎప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదని సింధు తెలిపింది. “నేను చేయగలనని ఎప్పుడూ నమ్మాను. చాలా మంది నా కెరీర్ గురించి ప్రశ్నలు లేవనెత్తినా, నా నమ్మకాన్ని వదల్లేదు” అని చెప్పింది. కఠినంగా శ్రమించానని, అదే తన విజయానికి ప్రధాన కారణమని వెల్లడించింది. కుటుంబ సభ్యులు, కోచ్‌లు, సహాయక బృందం తనకు అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపింది.

### ప్రశాంతతే విజయానికి బలం

ఈ టోర్నీలో ప్రశాంతంగా ఆడటమే తన విజయ రహస్యమని సింధు వివరించింది. ప్రతి పాయింట్‌పై పూర్తి దృష్టి పెట్టానని చెప్పింది. ఆధిక్యంలో ఉన్న సమయంలో కూడా నిర్లక్ష్యం చేయకుండా అదే దూకుడును కొనసాగించానని తెలిపింది. అనవసర తప్పిదాలను తగ్గించడం వల్లే మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం సాధించగలిగానని వెల్లడించింది. కోచ్ ఇచ్చిన సూచనలు కీలకంగా మారాయని చెప్పింది.

### ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై గురి

జపాన్ ఓపెన్ విజయం తనలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని సింధు పేర్కొంది. వచ్చే నెల భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరు కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఐదు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు గెలిచిన సింధు, ఆరో పతకం సాధించి మరో చరిత్ర సృష్టించాలని భావిస్తోంది. ఈ విజయం తన కెరీర్‌కు కొత్త మలుపు అవుతుందని, భారత అభిమానుల అంచనాలను నిలబెట్టేందుకు మరింత కష్టపడతానని స్పష్టం చేసింది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085